సాక్షి
శ్రీకాకుళం
సోమవారం ¦ 12 ¦ ఆగస్టు ¦ 2024



అ'బీమా'నం ఉందా..?

పంట బీమా విషయమై ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదు. దీనిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



రిమ్స్‌కు సమస్యల సుస్తీ

రిమ్స్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. రోగులు ఇబ్బంది పడుతున్నారు. - 8లో

నేటితో ముగియనున్న పీజీ సెట్ ఆప్షన్ల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రం యూనిట్‌గా విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పీజీ సెట్ -2024 ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా ఆప్షన్ల ఎంపిక సోమవారం సాయంత్రంతో ముగియనుంది. ఈ కౌన్సెలింగ్ ద్వారానే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ కళాశాలల్లో ప్రవేశాలు నిర్వహిస్తారు. సెట్ రాసిన విద్యార్థులకు ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

న్యూస్‌రీల్

కాశీబుగ్గలో బాలుడు అదృశ్యం



అదృశ్యమైన విశ్వజిత్ (ఫైల్)

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నెహ్రూనగర్‌కు చెందిన కిల్లంశెట్టి విశ్వజిత్ (10) అనే బాలుడు ఆదివారం అదృశ్యమయ్యాడు. సెలవు దినం కావడంతో వీధిలో ఆడుకుంటున్న బాలుడు ఒక్కసారిగా కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు అందరినీ సంప్రదించారు. ఎక్కడా కనిపించకపోవడంతో తండ్రి కిల్లంశెట్టి రాజేంద్ర కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా కనిపిస్తే 9959464980 నంబర్‌కు సమాచారం చేరవేయాలని కోరారు.

అదుపులోకి వచ్చిన అతిసార వ్యాధి

జి.సిగడాం: మెట్టవలస కోలుకుంటోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు 150 మంది పారిశుద్ధ్య కార్మికులు, 30 మంది పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ కామొజుల సీతారాం, ఎంపీటీసీ బెవర జగన్నాథం సహకారంతో గ్రామంలో ప్రతి వీధిలోనూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. రాజాం నుంచి తాగునీరు అందజేశారు. దీంతో 36 గంటల వ్యవధిలో అన్నీ సద్దుబాటు అయ్యాయి. గ్రామంలో వారం రోజుల నుంచి ప్రబలుతున్న డయేరియాను అదుపులోకి తీసుకురావడానికి ముగ్గురు సూపర్‌వైజర్లు, 20 మంది ఏఎన్‌ఎంలు, 50 మంది ఆశా కార్యకర్తలు, 20 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, ఇతర సిబ్బందితో కలిసి పనిచేశారు. వ్యాధితో బాధపడుతున్న రోగులకు వైద్యులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు, సీహెచ్‌ఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. దీంతో ఇక్కడ వ్యాధి తగ్గుముఖం పట్టింది. మొత్తం 80 కేసులు నమోదు కాగా.. 40 మందిని శ్రీకాకుళం, రాజాం, పొందూరు ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. మిగిలిన వారికి స్థానికంగానే వైద్యం అందించారు. ప్రస్తుతం వీరంతా ఆరోగ్యంగా ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి కషాయాల తయారీ



నిమ్మతొర్లువాడలో కషాయాలు తయారు చేస్తున్న సిబ్బంది

ఆమదాలవలస: ఆమదాలవలస మండలంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆదివారం సిబ్బంది రైతులతో పలు రకాల కషాయాలు తయారు చేయించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ కొరపాం, నిమ్మతొర్లువాడ, కొత్తవలస గ్రామాలలో దశ పర్ని, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, జిల్లేడు కషాయాలు ఎక్కువ మోతాదులో తయారు చేయించామని అన్నారు. ఈ కషాయాలను రైతులు పంటలో ఉపయోగించడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి ,జానకిరామ్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా కొండచీపుర్ల సాగు

ఎల్‌ఎన్ పేట: గిరిజనులు కొండపోడు పంటల్లో సాగుచేసే వాణిజ్య పంటల్లో ప్రధానంగా చెప్పుకునే కొండ చీపుర్ల సాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించటం వల్ల కొండ చీపుర్ల సాగు బాగుందని మురగడలోవ, సూదిరాయిగూడ తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు చెబుతున్నారు. జూన్ నెల నుంచి కురుస్తున్న వర్షాలకు కొండచీపుర్ల దుబ్బులు పొదల్లా అల్లుకుంటున్నాయని గిరిజన రైతులు సవర సింహాచలం, సవర గంగయ్య, సవర చిరంజీవి తదితరులు తెలిపారు. డిసెంబర్, జనవరి నెలల్లో పూతకు వస్తాయన్నారు. ఆ తర్వాత కోతకోసి ఆరబెడతామన్నారు. కట్టలు కట్టి విక్రయిస్తామని వివరించారు. మండలంలోని 16 గిరిజన గ్రామాలు ఉండగా సుమారు 3వేల ఎకరాల్లో కొండ పోడుగా కొండచీపుర్ల సాగు చేస్తున్నట్లు ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు చెబుతున్నారు.



ఆశాజనకంగా ఉన్న కొండచీపుర్ల పంట



అలసిన బతుకులు

వేట నిషేధ కాలం తర్వాత కూడా మత్స్యకారులకు విషాద కాలం కొనసాగుతోంది. వరుసగా వచ్చిన తుఫాన్లు, వాయుగుండాలతో కొన్నాళ్లు చేపల వేటకు అంతరాయం కలిగింది. ఆ తర్వాత కూడా గంగపుత్రుల వలకు చేపలు చిక్కక అలసటే మిగులుతోంది. ఓ వైపు మత్స్యకార భృతిపై అతీగతీ లేకపోవడం, మరోవైపు వేటకు గడ్డు పరిస్థితులు ఎదురుకావడంతో వారికి రోజులు భారంగా గడుస్తున్నాయి.

- మత్స్యకారులకు గడ్డుకాలం
- చిక్కని చేప
- వేట నిషేధ కాలం తర్వాత అనుకూలించని పరిస్థితులు
- ఇంకా అందని మత్స్యకార భరోసా



వేట లేక తీరంలోనే లంగరు వేసి ఉన్న బోట్లు

వజ్రపుకొత్తూరు:


కడలంతా వెతికి చూసినా గంగపుత్రుడికి కన్నీరే మిగులుతోంది. రెండు నెలల విరామం తర్వాత ఉత్సాహంగా వేటకు వెళ్లిన మత్స్యకారులకు నిరాశే ఎదురవుతోంది. ఆశించిన మేర మత్స్య సంపద దొరక్కపోవడం, కనీసం బోట్ల డీజిల్ ఖర్చులు కూడా రాకపోవడంతో దిగాలుగా తీరం చేరుకుంటున్నారు. మరోవైపు వేట నిషేధ కాలం పూర్తయి చాలా రోజులవుతున్నా కొత్త ప్రభుత్వం మత్స్యకార భృతిపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడం వారిని కలవరపరుస్తోంది.

జిల్లాలో దాదాపు రెండు లక్షల మందికి పైగా మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 16,569 మంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేటపై ఆధారపడి బతుకుతున్నారు. ఏడాదిలో పది నెలల పాటు వీరు కడలిలోకి వెళ్తారు. అయితే ప్రకృతి విపత్తులు, ప్రభుత్వం విధించే వేట నిషేధం కాలంలో వీరికి కష్టకాలం ఎదురవుతుంది. దళారుల దగ్గర అప్పులు తెచ్చుకుని రోజులు గడుపుతుంటారు. గత ఐదేళ్లలో చెప్పిన సమయానికి మత్స్యకార భరోసా అందించి ఆ వేదన లేకుండా చేశారు. కానీ ప్రభుత్వం మారక మత్స్యకారులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.

నిషేధ కాలం తర్వాత..

ఏటా రెండు నెలలు మత్స్య సంపద పునరుత్పత్తి కారణంగా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటను ప్రభుత్వం నిషేధిస్తుంది. ఈ రెండు నెలల కాలంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరు. సముద్రంలో చేపల సంతానోత్పత్తి పెరగడంతో పాటు అప్పటికే ఉన్న మత్స్య సంపద మరింతగా పెరుగుతుంది. ఐతే సముద్ర తీరం వెంబడి ఏర్పాటవుతున్న పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య వ్యర్థాలను సముద్ర జలాల్లో వదిలేస్తుండడంతో మత్స్య సంపద ఉనికి కోల్పోతోంది. దీనికి తోడు తమిళ జాలర్లు పెద్ద బోట్లతో భారీగా వేట సామగ్రితో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తీరాల్లోకి వచ్చేస్తుండడంతో వీరికి ఏమీ మిగలడం లేదు. ప్రస్తుతం నిషేధ కాలం ముగిశాక వాయుగుండాలు, అల్పపీడనాలు ఏర్పడి సముద్రంలోకి వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. ఆ తర్వాత కూడా సముద్రంలో చేపలు ఆశించినంతగా దొరక్కపోవడంతో వారు నిరాశలో కూరుకుపోతున్నారు.

రూ.20 వేలు సాయంపై మౌనం



గత ప్రభుత్వంలో ఏటా మే నెలలోనే మత్స్యకార భరోసాగా రూ.10వేలు పరిహారం అందించేవారు. జిల్లా పరిధిలో గత ఏడాది 15,281 మందికి మత్స్యకార భరోసాను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించింది. చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే రూ.20వేలు ఇస్తామంటూ హామీలు గుప్పించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా ఇంత వరకు మత్స్యకార భరోసాపై ఉలుకూపలుకు లేదు. దీంతో మళ్లీ అప్పులు చేయక తప్పని పరిస్థితి ఎదురవుతోంది. ప్రస్తుతం మత్స్యశాఖ మాత్రం మే నెలలో రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేయగా.. నవ శకం బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ పోర్టల్‌లో ఆరు దశలో వడపోయగా 1292 మందిని అర్హులుగా 2423 మంది అనర్హులుగా తేల్చారు. ఇందులో 100 లీటర్లు కనీస వినియోగం లేని మోటారు బోట్‌లలో పని చేస్తున్న 1890 మందికి అనర్హులుగా పేర్కొన్నారు. దీంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది.

చేపలు దొరకడం లేదు



సముద్రంలో ఎంత దూరం వెళ్లినా చేపలు దొరకడం లేదు. దీంతో రోజు వారీ ఇంటి దగ్గర ఖర్చుల కోసం వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకుంటున్నాను. ఈ లోగా ఆరోగ్యం ఏమైనా సుస్తీ చేస్తే ఆ అప్పు భారం తప్పదు. వేట సక్రమంగా జరిగితే ఆ బాధ ఉండదు. ఇస్తామన్న రూ.20వేల భరోసా ఇచ్చి ఉంటే ఖర్చులు గట్టెక్కేవి.

– రాంబాబు, మత్స్యకారుడు, మంచినీళ్లపేట, వజ్రపుకొత్తూరు మండలం

డీజిల్ ఖర్చు రావడం లేదు



వేటకు వెళుతుంటే చిన్న చిన్న చేపలు తగుతుతున్నాయి. అవి ఆశించిన ధరకు పోవడం లేదు. ఐదారుగురం కలిసి వేటకు వెళితే కనీసం డీజిల్ ఖర్చులు రావడం లేదు. తమిళ జాలర్లు, మర బోట్ల వల్ల సముద్రంలో మత్స్య సంపద లేకుండా పోతోంది. ప్రభుత్వం వేట నిషేధ భృతి ఇవ్వడంతో పాటు ఆధునిక వేట సామగ్రిని సబ్సిడీపై అందించాలి.

– జుత్తు చిన్నారావు, బావనపాడు, సంతబొమ్మాళి మండలం



చేపలు దొరక్క ఖాళీ బోట్లను ఒడ్డుకు తీసుకువస్తున్న మత్స్యకారులు

నేడే వినండి

- ఆల్ ఇండియా రేడియోలో మన తప్పెటగుళ్ల పాట



విశాఖపట్నం ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో రేగులపాడు తప్పెటగుళ్ల కళాకారులు

కాశీబుగ్గ/పలాస: ఆల్ ఇండియా రేడియోలో మన తప్పెటగుళ్ల పాట వినపడనుంది. పలాస మండలం రేగులపాడు తప్పెటగుళ్ల బృందానికి ఈ అవకాశం దొరికింది. ప్రసారభారతి బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు ఆల్ ఇండియా రేడియో విశాఖపట్నం కేంద్రంలో పాడే అరుదైన అవకాశాన్ని ఇచ్చారు. పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ రేగులపాడు గ్రామానికి చెందిన పీత గంగయ్య, అతని ఏడు మంది తప్పెటగుళ్ల బృందాన్ని ఫోక్ మ్యూజిక్ విభాగానికి ఎంపిక చేసింది. ఇటీవల ఆడిషన్స్ పూర్తి చేసి పాడిన పాటను పదిహేను నిమిషాలు రికార్డు చేశారు. ఈ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 2.30కు విశాఖపట్నం కేంద్రంగా ప్రసారమయ్యే ఆల్ ఇండియా రేడియోలో ఈ పాట ప్రసారం కానుంది. ఈ సందర్భంగా బృంద నాయకుడు పీత గంగయ్య 'సాక్షి'తో మాట్లాడుతూ మొదటగా ఐదు నిమిషాలు ప్రార్థన గీతం పాడామని అన్నారు. అనంతరం తప్పెటగుళ్ల కళాకారుల పాటలో ఒకటైన అలియదేవి కథను పాడామని, దీన్ని సుమారు పదిహేను నిమిషాలు రికార్డు చేశారని అన్నారు. మువ్వల సవ్వడి నుంచి పాటను వారు రికార్డు చేశారని, మాకు రూ.18 వేలు నగదు ప్రోత్సాహకం అందిస్తున్నట్లు సమాచారం అందించారని తెలిపారు. అలియాదేవి కథలో శ్రీకృష్ణుడు, అర్జునుడు సముద్రానికి వెళ్లినప్పుడు అలియాదేవి కనిపిస్తుంది. ఆ అందమైన దేవి తనకు కావాలని అర్జునుడు కృష్ణుడికి చెప్పడంతో.. ఆమె వద్దకు వెళ్లే మార్గాన్ని వివరిస్తూ సాగే సంభాషణే ఈ కథ. రేడియోలో పాట పాడే అవకాశం తమకు రావడం సంతోషంగా ఉందని అన్నారు.

ముగిసిన స్విమ్మింగ్ పోటీలు



నాలుగు బంగారు పతకాలు సాధించిన దీక్షా బెహరాను అభినందిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, పక్కనే హారికాప్రసాద్, జగన్మోహనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలతో ఆరోగ్యంతో పాటు, ఉజ్వలమైన భవిష్యత్ కూడా లభిస్తుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న స్విమ్మింగ్‌పూల్ వేదికగా జరిగిన రెండు రోజుల జిల్లాస్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్విమ్మింగ్ క్రీడ ద్వారా శరీరంలోని అన్ని అవయవాలకు వ్యాయామం లభిస్తుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి అసోసియేషన్ తీసుకుంటున్న చొరవను మెచ్చుకున్నారు. సంఘ ప్రతినిధులు హారికాప్రసాద్ తదితరులను ప్రశంసించారు. జిల్లాలో స్విమ్మింగ్ క్రీడాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, స్విమ్మింగ్ మీట్ ఏర్పాటు ఉద్దేశాన్ని కేవీఎస్‌ఎస్‌వీ ప్రసాద్ వివరించారు.

విజేతలకు పతకాలు అందజేత..

అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు కలెక్టర్ చేతులమీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ మీట్‌లో అత్యుత్తమ ఆటతీరు కనబర్చిన దీక్షా బెహర, సీహెచ్ సుశాంత్, కె.సింధు, చిన్మయి శ్రేష్టలు తలా నాలుగు బంగారు పతకాలు సాధించగా, ఎస్.ప్రీతంరాజా మూడు బంగారు పతకాలు సాధించారు. మిగిలిన ఈవెంట్స్‌లో పలువురు క్రీడాకారులు మెరిశారు. పతకాలు అందుకున్నారు.

వివిధ ఈవెంట్స్‌లో రాణించిన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రపోటీలకు ఎంపిక చేయనున్నట్టు స్విమ్మింగ్ సంఘ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ సంఘ జిల్లా కార్యదర్శి కె.రఘూన్సీ, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డీఎస్‌డీఓ కె.శ్రీధర్‌రావు, బాలాజీ, ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, డాక్టర్ గురుగుబెల్లి ప్రమీల, ప్రసాదరావు, అంతర్జాతీయ స్విమ్మర్ ఎస్.కాంతారావు, జోగినాయుడు, మురళీధర్, సంఘ ప్రతినిధులు, క్రీడకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో..



శ్రావణ మాసం మొదటి ఆదివారం సందర్భంగా శ్రీముఖలింగేశ్వరుడిని అధిక సంఖ్యలో శివస్వాములు దర్శించుకున్నారు. వంశధార నదిలో స్నానాలు చేశారు. గర్భగుడిలో ఉన్న గోలెంనకు మొక్కి అనంతరం వారాహి అమ్మవారికి పూజలు నిర్వహించారు. – జలుమూరు

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

ఇచ్ఛాపురం: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మున్సిపాలిటీ బెల్లుపడలోని ఎస్సీ వీధి కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన ఆదివారం క్షీరాభిషేకం చేశారు. గతంలో అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు జరగలేదని, ఇప్పుడు దాడి చేసిన వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉండడం అమానుషమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, డీసీఎంఎస్ మాజీ చైర్ పర్సన్ సల్లా సుగుణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి దేవరాజు, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, కారింగి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో శ్రావణ సందడి



సూర్యనమస్కారాల పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి సన్నిధిలో శ్రావణ మాసం సందడి మొదలైంది. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం తొలి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో మహిళలు ఇంద్రపుష్కరిణి ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. రావిచెట్టు వద్ద ప్రత్యేక ప్రదక్షిణలు చేసి దీపారాధన చేశారు. భక్తులకు ఉచిత మంచినీరు, ప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద భోజనాన్ని కల్పించేలా ఆలయ అధికార సిబ్బంది తగు చర్యలు చేపట్టారు. కొత్తగా విధుల్లోకి చేరిన వన్‌టౌన్ సీఐ నాయుడు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తుల క్యూలైన్లను, ట్రాఫిక్‌ను పరిశీలించారు.

కందకాలు కప్పేస్తున్నారు



బుచ్చిపేట వద్ద రెవెన్యూ అధికారులు తవ్విన ట్రెంచ్‌ను ఒక వైపు కప్పిన దృశ్యం

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం వచ్చాక నరసన్నపేట నియోజకవర్గంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. తమకు నచ్చినట్లు ఇసుకను వంశధార నుంచి అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. అడ్డు చెప్పిన వారికి ముడుపులు చెల్లిస్తూ తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ యంత్రాంగం రీచ్‌ల వద్ద కందకాలు తవ్వినా వాటిని కప్పి, నదిలోనికి వెళ్తూ ఇసుకను తరలిస్తున్నారు. బుచ్చిపేట వద్ద ఇసుక రీచ్‌లోనికి వెళ్లకుండా వీఆర్వో తవ్వించిన ట్రెంచ్‌ను కొందరు ట్రాక్టర్ యజమానులు కప్పేయడం సంచలనంగా మారింది. మడపాం పంచాయతీ బుచ్చిపేట వద్ద రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో లుకలాం, బుచ్చిపేట, పర్లాం ఇసుక తవ్వకాలు రాత్రి సమయాల్లో జరుగుతున్నట్లు సమాచారం. ప్రధానంగా పర్లాం వద్ద వంశధారలో ఎంత నీరు వచ్చినా అక్కడ ఇసుక తవ్వకాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇసుక దిబ్బలు పెద్ద ఎత్తున ఉన్నాయి. తవ్వకాలకు అనుకూలంగా ఉంటుంది. దీన్ని ఇసుక మాఫియా తమకు అనుకూలంగా మలుచుకొని అక్రమ వ్యాపారానికి పాల్పడుతోంది.

ట్రాక్టర్ ఇసుక రూ. 7 వేలు

నరసన్నపేట ప్రాంతంలో గృహ నిర్మాణదారులు ట్రాక్టర్ ఇసుకను రూ. 7 వేల వరకూ వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఇసుక తరలింపులో ఆరితేరిన కొందరు.. ట్రాక్టర్ల లోపల ఇసుక వేసి పైన మట్టి లేదా గడ్డి వేసి తరలిస్తున్నారు. అనుమానంతో అడ్డు చెప్పిన వారికి స్పాట్‌లో డబ్బులు ముట్టజెప్పి ముందుకు సాగుతున్నారు. మరో పక్క గడిచిన రెండు నెలలుగా ఇసుక కోసం గృహ నిర్మాణదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉచిత ఇసుక విధానం అని చెప్పి స్టాక్ యార్డుల్లో కూడా అధిక ధరలకు ఇసుకను విక్రయాలు చేసిన విషయం విదితమే.

కొత్త ర్యాంపులకు కసరత్తు

జిల్లాలో నరసన్నపేట మండలం ఉప్పరిపేట, జలుమూరు మండలం దొంపాక, అందవరం, శ్రీకాకుళం రూరల్ మండలం బైరిల్లో కొత్తగా ఇసుక ర్యాంపులు మంజూరు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం శ్రీకాకుళం వారు ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామ సభలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 11వ తేదీన ఉప్పరిపేట, బైరిల్లో, 12 వతేదీన అందవరం, దొంపాకల్లో ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామ సభలు నిర్వహించనున్నారు.

నేటితో ముగియనున్న ఆప్షన్ల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ప్రవేశాలకు సంబంధించి మూడో విడత కౌన్సెలింగ్ సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ముగియనుంది. రెండు విడతల కౌన్సెలింగ్‌లో సీట్లు లభించిన విద్యార్థులు క్యాంపస్‌ల మార్పునకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సీటు వచ్చి హాజరు కాని మెరిట్ లిస్ట్‌లో ఉన్న విద్యార్థులు సైతం రిజిస్ట్రేషన్ చేసుకుని మూడో కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చు. విద్యార్థులు ఈ కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు.

క్లుప్తంగా

సిక్కోలు జానపదంపై పాట షూటింగ్



వడ్డినవలస సమీపంలో షూటింగ్ చేస్తున్న నిర్వాహకులు

సారవకోట: మండలంలోని వడ్డినవలస పరిసర ప్రాంతంలో సినీ ప్రొడ్యూసర్ ఇప్పిలి రామ్మోహనరావు ఆధ్వర్యంలో సిక్కోలు జానపద పాటలపై షూటింగ్ నిర్వహించారు. పీఆర్ మ్యూజికల్ (పాట్టిమామ) టీమ్ సభ్యులు శ్రీకాకుళం జానపద పాటలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రస్తావిస్తూ ఒక పాటను చిత్రీకరించారు. ఇందులో గొర్లె నూకయ్య, డింపుల్ అమ్ము తదితరులు పాల్గొన్నారు.

కాష్యూ, రైస్‌మిల్ లేబర్ యూనియన్ ఎన్నిక ఏకగ్రీవం



అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు కృష్ణమూర్తి, ఈశ్వరరావు, రాము

కాశీబుగ్గ: పలాస, కాశీబుగ్గ, మొగలిపాడు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలో ఉన్న జీడి పరిశ్రమలు, రైల్ మిల్లర్స్ కార్మికులతో కూడిన కాష్యూ రైస్ మిల్లర్ లేబర్ యూనియన్ ఎన్నిక ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగింది. పలాస కార్మిక భవనం వద్ద జరిగిన ఈ ఏకగ్రీవ ఎన్నికల్లో నూతన అధ్యక్షులుగా అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శిగా సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాములను ఎన్నుకున్నారు.

బ్యాటరీ చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహీంబాద్ పంచాయతీ పూడివలస రోడ్డులో ఉన్న మందు గుండు సామగ్రి గోదాం వద్ద ఉన్న జనరేటర్ బ్యాటరీ శనివారం రాత్రి చోరీకి గురైంది. రూ.20 వేల విలువ ఉన్న బ్యాటరీని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. యజమాని శ్యాంకుమార్ ఆదివారం ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

'ఛాయారాజ్ ఓ దార్శనిక కవి'



పండి మోహనరావును అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఛాయారాజ్ ఒక దర్శనిక కవి, రచయిత అని ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు పండితులు, ఉపనిషన్మందిర ప్రతినిధి పండి మోహనరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం విద్యారంగం-విలువలు- ఛాయారాజ్ కథలు అనే అంశంపై తెలుగు పండితులు పండి మోహనరావు ఆదివారం ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నా ఆగ్రహం, నా ఆవేశం, శత్రువుకు అర్థం కావాలి, నా ప్రేమ, నా శక్తి నా భాషలో వ్యక్తం కావాలి' అని కలం ఎక్కుపెట్టిన ప్రజాకవి ఛాయారాజ్ అని అన్నారు. వివిధ సాహిత్య ప్రక్రియలో అనుభవం గల ఛాయారాజ్ కలం నుంచి వెలువడిన 'అనుపమాన' కథా రూపకాల్లో నేటి విద్యారంగం తీరుతెన్నులు వివరించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపనిషన్మందిర ప్రతినిధులు పతంజలి శాస్త్రి, ఎం.మోహనరావు, ఎస్.నరసింహమూర్తి, ఎం.సంగమేశ్వరరావు, డి.జి.పట్నాయక్, రవి, కోటేశ్వరరావు, అరుణకుమారి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

57 బెంచీల వితరణ



దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్క్)లో వాకర్స్ బ్యాచ్ ఆధ్వర్యంలో దాతల సాయంతో 57 కూర్చునే సిమెంట్ బెంచీలు వేశారు. ప్రతి రోజు ముత్యాలమ్మ కోనేరులో వ్యాయామానికి, నడవడానికి వచ్చే వ్యాపారులు, ఉద్యోగులు, వైద్యులు, వివిధ వర్గాలకు చెందిన మేధావులతో ఏర్పాటు చేసిన వాకర్స్ బ్యాచ్ ఈ బెంచీల ఏర్పాటుకు సహకారం అందించారు. 57 బెంచీలను అనేక మంది ముందుకు వచ్చి ఏర్పాటు చేయడంతో జంటపట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేకాట శిబిరం నుంచి రూ. 1.50 లక్షలు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం గ్రామం సమీపంలో ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై ఎచ్చెర్ల ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలోని సిబ్బంది దాడిచేశారు. రూ.1.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట శిబిరాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఎస్ఐ చెప్పారు. 20 మందిని పట్టుకున్నారు. పది మొబైళ్లు, నాలుగు టూ వీలర్లు స్వాధీనం చేసుకున్నారు.

రైతుపై అ'బీమా'నం ఉందా..?

- జిల్లాలో 75 శాతం వరి నాట్లు పూర్తి
- ఇప్పటి వరకు ఖరీఫ్ సీజన్‌కు ఖరారు కాని పంటల బీమా పథకం
- అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల నడుమ ఆందోళనలో అన్నదాత



ఉద్దానంలో వరి పొలాన్ని సిద్ధం చేస్తున్న అన్నదాత

కవిటి:

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు సాగు భారమవుతోంది. జిల్లాలోని 30 మండలాల పరిధిలో ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 1,54,928 హెక్టార్లుగా జిల్లా వ్యవసాయశాఖ అంచనాలు సిద్ధం చేసింది. ఈ మేరకు అన్ని మండలాలకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాల పంపిణీ పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా వరిసాగు వెద పద్ధతి, నాట్లు వేసే పద్ధతుల్లో జరుగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం 1,05,960 హెక్టార్లలో వరి నాట్లు వేసినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ వరిసాగు చేసే అన్నదాతకు పంటలకు బీమా రక్షణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వాస్తవానికి గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతుకు ఎలాంటి ప్రీమియం భారం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50శాతం ప్రీమియంను భరించి వంద శాతం రాయితీతో పంటల బీమా పథకాన్ని అమలుచేశారు. ఈ పథకం ద్వారా రైతులు కష్టకాలంలో భారీగా బీమా పరిహారాన్ని పొందారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక దీనిపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీనికి తోడు ఇస్తామన్న రైతు భరోసా సాయంపైనా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనికి తోడు పంటల బీమా పథకం గతంలో మాదిరిగా ఉండదని ప్రభుత్వంలోని కొందరు కీలక నేతలు ప్రకటనలు ఇవ్వడం అన్నదాతను మరింత ఆందోళనలోకి నెట్టేసింది.

ఎన్నో సందేహాలు..

పంట రుణాలు తీసుకున్న వారికి బీమా పథకం వర్తింపజేస్తారా? ఆ బీమా పథకం ప్రీమియం బ్యాంకులు ద్వారా కంపెనీలకు చెల్లిస్తారా? నేరుగా రైతులే చెల్లించాలా? ఈ-క్రాప్ నమోదు ఆధారంగా పంటల బీమా పథకానికి అర్హతను ఖరారు చేస్తారా? పంట రుణాలు పొందని రైతులకు ఈ పథకం వర్తిస్తుందా? అనే అంశాలు అన్నదాతల్లో గందరగోళానికి దారితీస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంటల బీమా పథకం అమలు విషయంలో కచ్చితమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

విధివిధానాలు పాటించాలి..



సన్న,చిన్న కారు రైతుల్లో ఆందోళనకు కారణమవుతున్న పంటల బీమా పథకానికి విధివిధానాలు ఇప్పటి వరకు ప్రకటించకపోవడం శోచనీయం. ఊరూరా రైతు సదస్సులు నిర్వహించిన అధికారులు ఇందుకు సంబంధించి రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు కూడా ఇవ్వలేకపోయారు.

– పులకల శ్రీరాములు,
రైతు, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ సెక్రటరీ,
కవిటి మండలం

అన్యాయం చేయకూడదు..



జిల్లా వ్యాప్తంగా 75 శాతం సాగు పూర్తయ్యిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పంటల బీమా పథకంపై కచ్చితమైన మార్గదర్శకాలను తక్షణం విడుదల చేయాలి. గత ప్రభుత్వంలో మాదిరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ప్రీమియం చెల్లించడం ద్వారా రైతుకు భారం లేని బీమా పథకం కొనసాగాలి. లేకుంటే అంతకన్నా మెరుగైన విధానం ఏదైనా సూచించగలిగితే దాన్ని సత్వరమే విధివిధానాలతో మార్గదర్శకాలు విడుదల చేయాలి. రైతులకు అన్యాయం చేయకూడదు.

– బద్రి ప్రకాష్,
రైతు, వైఎస్సార్‌సీపీ నేత, కవిటి మండలం

● నాలుగు దశాబ్దాల తర్వాత..



బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83లో చదివిన వారు ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో మళ్లీ కలిశారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. నాటి జ్ఞాపకాలు నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థి వాక రాంబాబు పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందజేశారు.

– సారవకోట

ఉపాధికి దారి



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంతోపాటు అనేక ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు వేగవంతమవుతున్నాయి. పెరుగుతున్న రోగాలు, వ్యాధుల నివారణ, నిర్ధారణ, చికిత్స రంగాలకి సంబంధించిన సాంకేతిక వినియోగం అద్భుతమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో వైద్య రంగంలో ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, పరిశోధన, వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల అద్భుతమైన పీజీ కోర్సును అందుబాటులోకి తీసుకువచ్చింది. సెంటర్ ఫర్ అప్లైడ్ సైన్సెస్ (గతంలో బయోటెక్నాలజీ) విభాగం ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచి రెండేళ్ల వ్యవధి కలిగిన ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ పీజీ ప్రోగ్రామ్‌ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రాంను సమర్థంగా నిర్వహించడం కోసం, కళాశాల అప్లైడ్ సైన్సెస్ విభాగం, ఆంధ్రప్రదేశ్ మెడ్-టెక్ జోన్ (ఏఎంటీజెడ్)-విశాఖపట్నం, ఇతర స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకోనుంది. కోర్సు పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశం లభించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, కోర్సు కోఆర్డినేటర్/హెచ్ఓడి డాక్టర్ ఎం.ప్రదీప్ పేర్కొన్నారు.

ఈ కోర్సులో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలు

- ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్‌లో చేరి, టాపర్‌గా నిలిచిన ఒక విద్యార్థి పీహెచ్‌డీ చేయడానికి నెలకు రూ.45000 విలువైన డీఎస్‌టీ ఇన్‌స్పైర్ ఫెలోషిప్ అవకాశం లభిస్తుంది.
- ఈ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులందరికీ డీబీటీ బీసీఐఎల్ పారిశ్రామిక శిక్షణ పథకం ద్వారా నెలకు రూ.12000 ఫెలోషిప్‌తో 6 నెలల పాటు ఉపాధి నైపుణ్య శిక్షణకు అవకాశం లభిస్తుంది.
- దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, సెంట్రల్ యూనివర్సిటీలు వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభిస్తాయి.
- ఐసీఎంఆర్ మద్దతు ఉన్న ప్రయోగశాలలో పీహెచ్‌డీ లేదా పరిశోధనను అభ్యసించే అవకాశాలు, జాతీయ స్థాయి వైద్య సంబంధిత శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది.
- ఈఎస్ఐఆర్, యూజీసీ, డీబీటీ, ఐసీఎంఆర్, జేఆర్ఎఫ్, నెట్ గురించి అవగాహన పెరిగి కోచింగ్‌కు, పరిశోధనలకు, ఫ్యాకల్టీగా స్థిరపడేందుకు అవకాశం లభిస్తుంది.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే అవకాశం ఉంటుంది.
- కోర్సు పూర్తయిన వెంటనే డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఫార్మా కంపెనీలలో తక్షణ ఉపాధి అవకాశాలను పొందవచ్చు.
- అప్లైడ్ సైన్సెస్ విభాగంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు డాక్టర్ ఎం.ప్రదీప్, డాక్టర్ ఆర్.హరిత, పి.సుధారాణి తదితరులు ఉండటం విద్యార్థులకు మరింత మేలు చేకూర్చే అంశం.
- ఏపీపీజీసెట్-2024కి హాజరై, అర్హత సాధించిన వారందరూ ఈ ప్రోగ్రాం కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- పీజీ సెట్-2024లో అర్హత సాధించని, పీజీసెట్-2024కి హాజరుకాని విద్యార్థులు ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రాంలో చేరాలనుకుంటే రెండో కౌన్సెలింగ్ తర్వాత అడ్మిషన్ ప్రక్రియ కోసం కళాశాలలోని బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూర్యచంద్ర, ప్రదీప్ కోరారు. మరిన్ని వివరాలకు 8555911961, 6301096643 నంబర్లను సంప్రదించాలన్నారు.

సైనిక లాంఛనాలతో ఎస్ఐ అంత్యక్రియలు





నర్సింగరావు పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న పోలీసు అధికారులు, పారామిలటరీ అసోసియేషన్ సభ్యులు (ఇన్‌సెట్లో) యాళ్ల నర్సింగరావు(ఫైల్)

నరసన్నపేట: యుక్త వయసు నుంచి సీఆర్‌పీఎఫ్ 60 బెటాలియన్‌లో వివిధ హోదాల్లో పని చేసి గుండె పోటుతో మరణించిన యాళ్ల నర్సింగరావు(58)కు స్వగ్రామం మడపాంలో ఆదివారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రస్తుతం ఇదే బెటాలియన్‌లో ఎస్ఐ హోదాలో ఉన్న నర్సింగరావు అమరనాథ్ యాత్ర ప్రదేశంలో డ్యూటీ ఉండగా 8వ తేదీన గుండెపోటుకు గురై ఆ తర్వాత మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని అమర్‌నాథ్ నుంచి విశాఖకు విమానంలో ఆర్మీ అధికారులు తీసుకురాగా.. అక్కడి నుంచి స్వగ్రామం మడపాంకు ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపేట కూడలి నుంచి మడపాం వరకూ గ్రామస్తులు, పారామిలటరీ జిల్లా అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ 60 బెటాలియన్‌కు చెందిన 9 మంది ఆర్మీ జవాన్లు వచ్చి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నర్సింగరావు మృతిపై జిల్లా పారామిలటరీ అసోసియేషన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. అసోసియేషన్ సభ్యులు యాళ్ల అప్పలనాయుడు, గంగిట్ల శ్రీను, ఎస్.రవి, పీటీ రావు తదితరులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎదుగుదలకు కృషి



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎదుగుదలకు, వారిని ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (312/2022) అధ్యక్షుడు సంకు అజయ్‌చక్రవర్తి, కార్యదర్శి నక్క రామకృష్ణ అన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆ సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రెండేళ్లపాటు ఈ నూతన సంఘం పనిచేయనుందని సంఘ బాధ్యులు తెలిపారు. చైర్మన్‌గా నటుకుల మోహన్, కో చైర్మన్‌గా తర్లాడ అప్పలనాయుడు, గౌరవాధ్యక్షులుగా ఎ.వేణుగోపాలరావు, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా దవళ రాజేంద్రకుమార్, అధ్యక్షులుగా సంకు అజయ్ చక్రవర్తి, కార్యదర్శిగా నక్క రామకృష్ణ, కోశాధికారిగా అగడప్రోలు రంగస్వామి, మీడియా కోఆర్డినేటర్‌గా నారా ఈశ్వరరావు ఆర్గనైజింగ్ సెక్రటరీగా గండేపల్లి జగన్నాథరావు, ఉపాధ్యక్షులుగా కింతలి రమేష్‌బాబు, మెట్ట నాగరాజు, టి.గణపతిరావు, డి.సునీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా దాలిరాజు, వెంకట చంద్ర మౌళీశ్వరరావు, కె.త్రినాథరావు, జీవీఎల్ కుమార్(వెంకీ), బాపట్ల కిరణ్ గాంధీ, సత్యన్నారాయణ, కార్యవర్గ సభ్యులగా బోను గోవింద్, నాగరాజు, నల్లబారికి శ్రీనివాసరావు, ఎర్ర చైతన్య, గుడ్ల రేవంత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మాధురి ఆత్మహత్యాయత్నం



పలాస ఆస్పత్రిలో దివ్వల మాధురి



లక్ష్మీపురం టోల్‌గేటు వద్ద ప్రమాదానికి గురైన మాధురి కారు

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం జాతీయ రహదారి టోల్‌గేట్ సమీపంలో ఆదివారం జరిగిన కారు ప్రమాదంలో దివ్వల మాధురి గాయపడ్డారు. అయితే ఇది ప్రమాదం కాదని తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని ఆమె చెప్పారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ వివాదంలో ఆమె పేరు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండగా.. ఇలా జరగడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. మాధురి ఆదివారం టెక్కలి నుంచి పలాస వైపు తన స్కోడా కారులో ప్రయాణిస్తూ పలాస మండలం లక్ష్మీపురం జాతీయ రహదారి టోల్‌గేటు వద్ద ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో ఆమె ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. అందులో ఉన్న మాధురి కాళ్లు, తలకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన హైవే సిబ్బంది హుటాహుటిన ఆమెను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అయితే అక్కడ ఆమె వైద్యం నిరాకరించారు. ట్రోలింగ్ భరించలేక తనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు మాధురి తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలకు విశాఖపట్నం తరలించారు.

'వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలి'



ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నూతన కార్యవర్గం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీం కోర్టు పునః సమీక్షించాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా నాయకులు కోరారు. శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ విజ్ఞాన మందిర్ ఇల్లిసిపురంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దళిత మహాసభ సీనియర్ దళిత నాయకులు బెంజిమెన్ సమావేశాన్ని నిర్వహించారు.

నూతన కార్యవర్గం

శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. జిల్లా కన్వీనర్‌గా సీనియర్ నాయకులు బోకర నారాయణరావు, కో-కన్వీనర్ జాన్, శ్యామ్ సుందర్‌రావు, ఎ.అప్పన్న,పి. సుధాకర్‌లను, గౌరవ అధ్యక్షులుగా నూతలపాటి భరత భూషణ్‌రాజు, ముఖ్య సలహాదారులుగా పోతల దుర్గారావు, అంపోలు ప్రతాప్, బోనెల అప్పారావులను నియమించారు. అలాగే కోశాధికారిగా లింగాల అప్పన్న, బోనెల రమేష్, మీడియా కన్వీనర్‌గా గంజి ఎజ్రా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డి.రాము, డి.అప్పలసూరి, పడాల ప్రతాప్, టి.ఉపేంద్రకుమార్, కంట కృష్ణ, పి.నాగేంద్రరావు, బి.చిన్నారావు, జామి రామకృష్ణ, లీగల్ అడ్వైజర్లుగా బి.మురళీకృష్ణ, జె.శ్రీనివాసరావు, జి.ఎం.ఎస్ అనిల్, సంయుక్త కార్యదర్శులుగా బి.ధన్‌రాజ్, ఎస్.సూర్యనారాయణ, బి.లక్ష్మీనారాయణ, వడ్డి పాపారావు, గుర్రాల చిన్నబాబు, తోట రాము, నిద్దాన రాము, కింజరాపు నూకరాజు, వన్నెల శ్యామసుందరరావు, బి.రాజు, మహిళ కన్వీనర్లుగా నూతలపాటి జయభూషణ మని, బుడుమూరు ప్రసన్నకుమారి, కె.సుభద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రిమ్స్‌కు సమస్యల సుస్తీ

- ఓపీ నమోదుకు తిప్పలు
- సెల్‌ఫోన్, ఆధార్ కార్డులు ఉంటే ఓపీ నమోదు
- ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓల్లేక వార్డుల్లో ఇబ్బందులు
- 95 మంది అవసరం కాగా.. విధుల్లో ఉన్నవారు 28 మంది



ఓపీ పొందేందుకు రోగుల పాట్లు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఓపీ నమోదు నుంచే కష్టాలు చుట్టుముడుతున్నాయి. ఓపీలో రోగి పేరు నమోదు చేసుకోవాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి. ఆధార్ కార్డు ఉన్నప్పటికీ దానికి సెల్ ఫోన్ నంబర్ అనుసంధానమై ఉంటేనే ఓపీ నమోదుకు వీలవుతోంది. అనుసంధానం చేసుకునే సౌలభ్యం రిమ్స్‌లో ఉన్నప్పటికీ సిగ్నల్స్ అందకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారిలో నిరుపేదలు ఎక్కువగా ఉంటున్నారు. వీరికి సెల్‌ఫోన్ ఉండే అవకాశాలు కూడా తక్కువగా ఉంటున్నాయి. దీంతో వీరు ఓపీ పొందలేకపోతున్నారు.

ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలు లేక తిప్పలు

ఓపీలోని అన్నివిభాగాలతో పాటు వార్డుల్లో కీలకంగా విధులు నిర్వహించే ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓల కొరత ఆస్పత్రిని వేధిస్తోంది. 950 పడకల ఆస్పత్రికి మూడు షిఫ్టుల్లో 95 మంది విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం 28 మంది సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం 15 పోస్టులను మంజూరు చేయగా ధ్రువీకరణ పత్రాలు పరిశీలన పూర్తయి ఇంటర్వ్యూలకు సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికలు రావటంతో భర్తీలను నిలిపివేశారు. ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం ఆనాటి జాబితాను రద్దు చేసి ఇప్పటికీ నియామకాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

సదరంకు ఇబ్బంది..

సదరం ద్వారా సూపర్ స్పెషాలిటీ సేవలైన న్యూరాలజీ, ఆంకాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ వంటి వైద్యుల ద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విజయనగరం ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేకపోవటంతో ఆ జిల్లాలోని రోగులు ధ్రువీకరణ పత్రాలకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుంటే శ్రీకాకుళం రిమ్స్‌కు పరీక్షల కోసం పంపిస్తున్నారు. గత ప్రభుత్వం 5 సూపర్ స్పెషాలిటీ విభాగాలతో పాటు పోస్టులను మంజూరు చేసినప్పటికీ.. రిమ్స్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోగులకు కష్టాలు తప్పటం లేదు. విశాఖపట్నంకు రిఫర్ చేయగా అక్కడ పరీక్షలు జరుపుకొని శ్రీకాకుళం జిల్లాకు వస్తే వారిచ్చే ధ్రువీకరణ నిర్ధారణ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీని వల్ల రోగులు మూడు నుంచి ఐదు సార్లు ఆస్పత్రి చుట్టూ తిరగాల్సి వస్తోంది. ధ్రువీకరణ పరీక్షల కోసం కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. కమిటీ డిజిటల్ సంతకం ఉంటే శ్రీకాకుళంలోనే నిర్ధారణ చేసుకునే వీలు ఉంటుంది. గతంలో రిమ్స్ అధికారుల నిర్లక్ష్యం వహించడం కారణంగా రోగులకు ఇబ్బందులు తప్పటం లేదు.

సమస్యలు నివేదించాం



రిమ్స్‌లోని సమస్యలను ఇటీవలి జరిగిన సమీక్ష సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్లాం. ఓపీ వద్ద సమస్యలు లేకుండా చేసేందుకు రిమ్స్ సిబ్బందిని పది మందికి పైగా ఏర్పాటు చేశాం. త్వరలోనే ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓ ఉద్యోగాలను బర్తీ చేసే అవకాశం ఉంది. సూపర్ స్పెషాలిటీ విభాగాలకు డిజిటల్ సంతకం కోసం ఉన్నత అధికారులకు దరఖాస్తు పంపించాం.

– డాక్టర్ షకీలా, సూపరింటెండెంట్, రిమ్స్ ఆస్పత్రి, శ్రీకాకుళం